# పరాజితుడు

పోలయ్య ఆరోజు చేయవలసిన పని అయిపోయింది. కూలీ డబ్బులు రూపాయి పావలా సంపాదించాడు. అదే అతనికి పెద్ద మొత్తంగా తోచింది రూపాయి నోటును అటూ యిటూ తిప్పి చూశాడు మనస్సు సంతోషంతో తబ్బిబ్బులయింది. పావలాబిళ్ళ అరచేతిలో మెరుస్తోంది. దాన్ని చూసి పోలయ్య మురిసిపోయాడు.

రేపటి గురించి అతనికి ఆలోచనేలేదు. కూలీ దొరకదన్న చింతలేదు.

పొలంనుంచి పంటధాన్యం తోలుకొస్తున్న రైతుమాదిరి పోలయ్య యింటికి బయలుదేరాడు రూపాయి పావలాతో అతని నడకలో ఠీవి పుట్టిపడుతోంది, ముఖంలో తృప్తినిండివుంది. కొంతదూరం వచ్చాక చొక్కా జేబు తడిమి చూచుకున్నాడు. నోటూ బిళ్ళా భద్రంగా వున్నాయి గూట్లో పక్షిపిల్లల్లాగా.

చకచకా ముందుకు సాగుతున్న పోలయ్య వున్నట్టుండి నడక జోరు తగ్గించాడు వింత వాసన ఏదో అతణ్ణి ఆవరించి లోబరుచుకుంది కమ్మటి వాసనలు విరజిమ్మే తోటగా తోచింది ఆ ప్రదేశం. అతి తియ్యందనం కమ్మదనం అతణ్ణి ఆకర్షించాయి. ఇలాంటి పరిస్థితి పోలయ్యకు తరచు ఎదురవుతూనే వుంటుంది. కొన్నిసార్లు నిగ్రహం చూపగలుగతాడు, కోరికను జయించి ఆ ప్రదేశందాటి దూసుకుపోగలుగుతాడు. కానీ తరచు ఆ కోరికకు దాసుడైపోతాడు.

ఆనాడు పోలయ్య కల్లుఅంగడిని దాటి ఒక్క అడుగైనా ముందుకు వేయలేకపోయాడు. రోడ్డుప్రక్కగా నిలబడి కోరికతో పోరాటం ప్రారంభించాడు. తానే జయం పొందినట్టు భ్రమించి కాలు ముందుకు వేయబోయాడు. కోరిక రెండు కాళ్ళనూ గట్టిగా పెనవేసుకుంది శక్తి అంతా కూడ గట్టుకుని నిగ్రహాన్ని పునికొలిపాడు కోరికను లాగిపారేయమని. లాభంలేకపోయింది. విగ్రహం చిత్తుగా ఓడిపోయి పోలయ్యవంక జాలిగా చూసింది. కోరిక విజయగర్వంతో జేబులోని రూపాయి పావలా వైపు తొంగిచూసి పకపకా నవ్వింది.

తీర్పు చెప్పేసి నిష్క్రమించే న్యాయాధిపతి హుందాతో పోలయ్య కల్లు అంగడివైపుదారి తీశాడు అప్పటికే అక్కడ కోలాహలంగా ఉంది. ముంతలు గబగబా ఖాళీ అవుతున్నాయి. రకరకాల తినుబండారాలమ్మేవాళ్ళు తమ బేరం జోరుగా సాగుతున్నందుకు సంతోషిస్తున్నారు

పోలయ్య ముంతనిండా కల్లు పోయించుకున్నాడు. పాల సముద్రం చిలికి సంపాదించిన అమృతభాండంలా తోచింది ఆ ముంత పోలయ్యకి కల్లుకు తోడు తినడానికి ఏవైనా వుంటేగాని పసందుగా వుండదు. పైగా పోలయ్యకి ఆకలిగా కూడా వుంది మామూలు పదార్థాలు ఆ ముంతదగ్గర అంతగా రాణించవు నాలిక చురుక్కుమని నషాళంవరకు ఘాటు వుంటేనే దాని ధాటికి ఆగుతాయి అనుకుని పచ్చిమెరకాయ బజ్జీలు ఒక అరజను తీసుకున్నాడు ప్రక్కగా జంగెట్లో "ముక్కలు" అమ్ముతోంది ఒక అవ్వ మధ్య మధ్య నంజుకోవడాని వాటిని మించినవి లేవు అవి నాలుగు కొన్నాడు బీడీకట్టకూడా కొన్నాడు

అన్నీ తీసుకుని ఒక ప్రక్కగా కూర్చున్నాడు. ముంత ఐదు నిమిషాలలో ఖాళీ అయిపోయింది అటూ ఇటూ చూశాడు మసగమసగగా వుంది ముంత వంక చూశాడు. లోపల కల్లు లేదు నెమ్మదిగా లేచి వెళ్ళి మరోముంత పోయించుకున్నాడు.

ఇదిగబిగబా త్రాగలేకపోతున్నాడు. బీడీపైన బీడీకాలుస్తున్నాడు. ఎంతో హాయిగావుంది. ఏమీ తెలియడంలేదు. ఎలాగయితేనేం ముంత ఖాళీ అయిపోయింది. బజ్జీలు, "ముక్కలు" కూడా అయిపోయాయి. ఆ సంగతి పోలయ్యకి బాగా తెలియదు.

ఆ కల్లు అంగడి అతనికి ఇంద్రసభ మాదిరిగా కనిపిస్తోంది. ఇంద్రసభ ఎలా వుంటుందో ఒకసారి సినిమాలో చూశాడు. అవన్నీ తెలియకుండానే తలుపుకొస్తున్నాయి.

రుచి, మైకచి, సంతోషం ఈమూడింటిలో మునిగి తేలుతున్నాడు మనిషి తేలికబడుతున్నట్లు అనిపిస్తోంది. కనురెప్పలు బరువెక్కుతున్నాయి.

ఎత్తుపీటమీద కూర్చుని కల్లు అమ్ముతున్న ఆసామీ పోలయ్య కళ్ళకు దేవేంద్రుడులా వున్నాడు. తూలుతూ పోతున్న ఆడవాళ్ళనిచూసి అప్సరసలు నాట్యం చేస్తున్నారనుకున్నాడు. బిచ్చగాళ్ళు చేసే రణగొణ ధ్వనులు దేవతలు మ్రోయించే దుందుభులుగా తోచాయి. అక్కడక్కడ జనం చతికిలపడిపోయి మైకంలో తీసే లల్లాయి పదాలు గంధర్వుల గానం అని అనుకున్నాడు.

పోలయ్య స్వర్గసుఖం అనుభవిస్తున్నాడు. కళ్ళుమూసుకుపోయాయి. అతికష్టంమీద కళ్ళు తెరవగలుగుతున్నాడు.

కొంతసేపు ఆ మగతలో సర్వం మరిచి కూర్చుండిపోయాడు ఆ యోగముద్రలో తాపసి మాదిరి.

మరికొంతసేపటికి కష్టపడి లేచి నిలబడ్డాడు. దూరంగా వెలుగుతున్న దీపాలు తారామండలంగా తోచాయి మైకం ఇంకా దిగలేదు. కళ్ళు పడబడుతున్నాయి తూలుతూ క్రింద పడబోతూ, నిలద్రొక్కు

కుంటూ అడ్డదిడ్డంగా నడుస్తూ వంతెన దగ్గరికి వచ్చాడు. వంతెన అంగడికి యిరవై గజాల దూరంలోనే వుంది.

యిుతూపోయి అక్కడ నుంచున్న ఒకాయన మీద పడ్డాడు. ఆయన పోలయ్య అవస్థ చూసి నెమ్మదిగా అతన్ని నెట్టాడు పోలయ్య క్రింద కూలబడ్డాడు.

మైకం సాంతం తగ్గకపోయినా యింటికి వెళ్ళాలన్న తలపు కలిగింది అతనికి తెలియకుండానే.

అర్థంలేని మాటలు ఏనో వాగుతున్నాడు కనిపించిన ప్రతి రిక్షావాడితో ఏదో సోది చెప్పుతున్నాడు మాటలు సగం మింగేస్తూ.

పోలయ్యవాలకం చూసి రిక్షావాళ్ళెవరూ అంగీకరించడంలేదు.

జేబులు తడిమి చూసుకున్నాడు లోపల మిగిలిన పావలా బయటికితీసి పావలా యిస్తాను కిరాయి కట్టమంటున్నాడు కాని అక్కడికి తీసుకపోవాలో తెలియక ఎవరూ రావడంలేదు.

పది నిమిషాలనుంచీ యీ తతంగం అంతా గమనిస్తున్న ఒక రిక్షావాడు తక్కిన రిక్షావాళ్ళను నెట్టుకుంటూ ముందు కొచ్చినే తీసుకెళ్తా రమ్మన్నాడు. పోలయ్యను చేయి పట్టుకుని రిక్షాదగ్గరికి తీసుకెళ్ళాడు. మూటను పెట్టినట్లు అమాంతంగా పోలయ్యను రెండు చేతుల్తో ఎత్తి రిక్షాలో కూర్చోపెట్టాడు.

ఇది చూస్తున్న తక్కిన రిక్షావాళ్ళు అతని వింత ప్రవర్తనకి ఆశ్చర్యపోతున్నారు.

రిక్షా రయ్యిమని సాగిపోయింది.

పోలయ్య రిక్షాలో వాలిపోయి ఏదో మాట్లాడుతున్నాడు రిక్షావాడు అదేమీ వినిపించుకోవటంలేదు.

రిక్షా అతివేగంగా పోతోంది.

పోలయ్య తన యింటినిగురించి చెబుతున్నాడు వినిపించీ వినపించని మాటలతో.

రిక్షావాడు ఆ మాటలు లక్ష్యపెట్టటంలేదు. పోలయ్య వుండే పాక రాగానే రిక్షావాడు అతణ్ణి ఎత్తుకుని దింపి పాక ముందు కూర్చోబెట్టాడు విదేసినట్టు.

జేబులోనుంచి పావలాతీసి రిక్షావాడి చేతిలో పెట్టాడు పోలయ్య.

రిక్షావాడు ఆ పావలావంక చూశాడు అతని కళ్లు అప్పటికే నీళ్ళతో నిండిపోయాయి. అది సరిగా కన్పించలేదు కూడా.

లోపల యిందాకటినుంచి అణచిపెట్టిన ఆవేశం పట్టు తప్పిపెల్లుబికింది ఆ పావలాబిళ్ళను కసితో పోలయ్య ముఖానికేసి కొట్టాడు అది పోలయ్యనుదురుమీద తగిలింది.

ఆ దెబ్బకు పోలయ్య అబ్బా! అని కేక పెట్టాడు.

లోపలనుంచి పోలయ్య భార్య గబగబా వచ్చింది. కేక విని భర్త త్రాగివచ్చి చేసే గొడవ ఆమెకు అలవాటే భర్తను చూసింది.

అప్పటికే రిక్షావాడు వెనక్కు తిరిగి వెళ్ళిపోతూతున్నాడు.

పోలయ్య భార్య అతణ్ణిచూసి "నువ్వా రంగన్నా! అయ్యను తీసుకొచ్చావండి. లోపలికి రాకుండా చక్కాపోతుండా వేరానాయనా!" అని ఖంగారుగా అడిగింది కొడుకుని.

రంగన్న కళ్ళవెంట నీళ్ళు జలజలా కారుతున్నాయి గొంతు మూగవోయింది.

కళ్లు తన జుంకి చొక్కాతో తుడుచుకుని రిక్షా త్రొక్కుకుంటూ వెళ్ళిపోయాడు బస్తీ వైపు, రిక్షాయింకా రెండు గంటలు తనవద్ద వుంచుకోవచ్చు కాబట్టి!